# భద్రాచలంలో ఎగిరేది గులాబీ జెండానే !



- ఏజెన్సీవాసుల సమస్యలన్నీ నాకు తెలుసు..
- గత ఎమ్మెల్యేలు అభివృద్ధి గురించి పట్టించుకోలేదు..
- ఎన్నికల్లో గెలిచి గోదావరి వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం చూపిస్తా..
- కరకట్ట నిర్మాణ పనులను వేగవంతం చేస్తా..
- 'నమస్తే'తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఆయన వృత్తిపరంగా వైద్యుడు. ప్రజావైద్యుడిగా ఆయనకు భద్రాచలం నియోజకవర్గవ్యాప్తంగా పేరున్నది. వైద్యుడిగా అంతా బాగా నడుస్తున్నా, ఏ బాదరబంధీ లేకపోయినా

**నమస్తే ఇంటర్వ్యూ**
INTERVIEW

ఆయన ప్రజాక్షేత్రంలోకి రావాలనుకున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి వచ్చారు. గత ఎన్నికల్లో ఓటమిని చవిచూసినా మొక్కవోని సంకల్పంతో ప్రజాసమస్యల పరిష్కారంపై పనిచేస్తున్నారు. ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ నుంచి సీటు సాధించి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆయనే డాక్టర్ తెల్లం వెంకట్రావు. ఆయన సోమవారం 'నమస్తే'తో ముచ్చటించారు. ఎన్నికల్లో భద్రాచలం నుంచి గెలిచేది బీఆర్ఎస్సేనని, ఇక్కడ గులాబీ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

**నమస్తే: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతున్నది..?**

**తెల్లం:** నియోజకవర్గమంతా గిరిజన ప్రాంతమే. గ్రామాలన్నీ నాకు కొట్టిన పిండి. వైద్యుడిగా వేలాది మంది గిరిజనులకు నేను వైద్యసేవలందించాను. వారికి సేవ చేసేందుకు రాజకీయ క్షేత్రంలోకి అడుగు పెట్టాను. గత ఎన్నికల్లో ఓటమి నన్ను ప్రభావితం చేయలేదు. ఈసారి ప్రజలు నన్ను గెలిపిస్తారు. ఊరూరా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాను. ప్రజలందరూ నన్ను ఆదరిస్తున్నారు. ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో మాకు బాగా కలిసి వచ్చింది. పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతున్నది.

**నమస్తే: భద్రాచలం పట్టణానికి వరద ముప్పు ఉంది. ఏటా వానకాలంలో ప్రజలు బిక్కు బిక్కుమంటూ ఉంటారు. సమస్య పరిష్కారానికి మీరేం చేస్తారు?**

తెల్లం: గోదావరి వరద ముప్పు గురించి నేను గతంలోనే సీఎం కేసీఆర్ దృష్టి తీసుకెళ్లాను. సమస్యపై కేసీఆర్‌కు కూడా పూర్తి అవగాహన ఉన్నది. ఆయన సానుకూలంగా స్పందించారు. భద్రాచలంలో కరకట్ట నిర్మాణానికి రూ.40 కోట్ల నిధులు మంజూరు చేశారు. మంత్రి అజయ్‌కుమార్ ఇటీవల పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల్లో గెలిచాక కరకట్ట పనులను వేగవంతం చేసి పూర్తి చేసేందుకు కృషి చేస్తాను. పనులకు మరో రూ.15 కోట్ల నిధులు విడుదల చేయించాను.

**నమస్తే: ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గ ప్రజలకు ఏం మేలు చేస్తారు?**

తెల్లం: ఎన్నికల్లో గెలిచేది నేనే. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేదీ నేనే. నీటి వనరులను గుర్తించి పంటలకు సాగునీటి వసతి కల్పించేందుకు కృషి చేస్తాను. భద్రచలానికి ఇప్పటివరకు ఆధ్యాత్మిక స్థలంగానే పేరున్నది. నేను ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాను. సీతమ్మ బరాజ్ పనులు సజావుగా సాగేందుకు శాయశక్తులా పనిచేస్తాను.

**నమస్తే : తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం నుంచి ఒకసారి సీపీఎం అభ్యర్థి, మరోసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచారు. ఈసారి ఎలాంటి పరిణామాలు ఉంటాయని మీరనుకుంటున్నారు?**

తెల్లం: గతంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు ప్రజలకు ఏమీ చేయలేదు. నియోజకవర్గం అభివృద్ధి పరంగా వెనుకబాటుకు కారణం వాళ్లే. ప్రజలు ఈసారి బీఆర్ఎస్‌కు మద్దతుగా ఉన్నారని నా నమ్మకం. నేను లోకల్ వ్యక్తిని. మాది దుమ్ముగూడెం మండలం. ప్రజల వైద్యుడిగా నాకు నియోజకవర్గవ్యాప్తంగా పేరున్నది. ప్రజలు నన్ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**నమస్తే: కేంద్రం ముంపు గ్రామాలను ఆంధ్రాలో కలిపింది కదా.. వాటిపై మీ కమిట్‌మెంట్ ఏంటి?**

తెల్లం: గతంలో భద్రాచలం నియోజకవర్గం చాలాపెద్దది. పోలవరం ప్రాజెక్ట్ ముంపు సాకు చూపి కేంద్రం అన్యాయంగా కొన్ని మండలాలు, కొన్ని పంచాయతీలను ఆంధ్రాలో కలిపింది. నేను ఎన్నికల్లోగెలిస్తే ఆ మండలాలు, పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపించేందుకు కృషిచేస్తాను.

## బీఆర్ఎస్‌తోనే ఏజెన్సీ అభివృద్ధి

**ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా**



ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులు

దమ్మపేట, నవంబర్ 27: బీఆర్ఎస్‌తోనే ఏజెన్సీ అభివృద్ధి సాధ్యమని, ప్రజలు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల పరిధిలోని నాయుడుపేట, మొద్దులగూడెం, బుగ్గవారిపాక, రామచంద్రాపురం, కొమ్ముగూడెం, అప్పారావుపేట, మల్లారం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మెచ్చా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గానికి రూ.కోట్లు తీసుకొచ్చి రోడ్లు, వంతెనలు, సీసీ, బీటీ రోడ్లు నిర్మించామన్నారు. దమ్మపేటలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కోర్టును అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పోడు రైతులకు పట్టాలు అందించామన్నారు. గ్రామాల్లో మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేశామన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి పింఛనును పెంచుతుందన్నారు. గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే ఇస్తుందన్నారు. నిరుపేదలకు సన్నబియ్యం అందజేస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా వర్తింపజేస్తుందన్నారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అందించేందేకు కృషి చేస్తానన్నారు. ప్రచారంలో పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ, దమ్మపేట, ములకలపల్లి జడ్పీటీసీలు పైడి వెంకటేశ్వరరావు, సున్నం నాగమణి, నాయకులు వగ్గెల పూజ, సోయం వీరభద్రం, దొడ్డాకుల రాజేశ్వరరావు, రమేష్, మల్లికార్జునరావు, బాబు, చిట్టిబాబు, సత్యనారాయణ, యుగంధర్, ఏసుబాబు పాల్గొన్నారు.



## 'రైతుబంధు'ను ఆపింది కాంగ్రెస్ పార్టీనే : ఎంపీ వద్దిరాజు

**రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రైతులకు రైతుబంధు అందకుండా ఆపింది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీనే అని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు పథకాన్ని ఐక్యరాజ్యసమితితోపాటు సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ ప్రశంసించారని గుర్తుచేశారు. రైతులకు అన్యాయం చేయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ నేతలు పథకాన్ని అడ్డుకున్నారన్నారు. రైతుల నోటి కాడ గింజను కాంగ్రెస్ తన్నేసిందన్నారు. ప్రజలంతా ఇది గమనిస్తున్నారన్నారు. రైతులను అప్పులపాలు కాకుండా, దర్జాగా వ్యవసాయం చేసుకునేందుకు సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కేవలం అక్కసుతోనే కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని, కాంగ్రెస్ పార్టీ రైతాంగ వ్యతిరేకి అన్నారు.

## ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ ప్రియాంక ఆల**



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): పోలింగ్‌కు రెండు రోజులే గడువు ఉందని, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సముదాయంలో సోమవారం సైలెంట్ పిరియడ్, మోడల్ పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు, ఎన్నికల కోడ్ అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ప్రచార కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఇదే రోజు సాయంత్రం నుంచి జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులోకి వస్తుందన్నారు. ఎక్కడా ప్రజలు గుంపులు గుంపులుగా గుమికూడ రాదన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించాలన్నారు. ఆ రోజు రాజకీయ పార్టీ నేతలు, అభ్యర్థుల సభలు, సమావేశాలు నిషేధమన్నారు. 29, 30వ తేదీల్లో పత్రికలు, టీవీ చానెళ్లలో అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలకు ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. బల్క్ మెసేజీలు, సోషల్ మీడియాలో రాజకీయ పోస్టింగ్స్ పెట్టొద్దని హెచ్చరించారు. అధికారులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో మధుసూదన్ రాజు, డీఆర్వో రవీంద్రనాథ్, డీపీఆర్వో శ్రీనివాస్, డీఈవో వెంకటేశ్వరాచారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

